క్లుప్తంగా

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయానికి ప్రతీక జరుపుకునే దీపావళి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అలాగే రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువుసత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్‌లు వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

15 మంది జూదరుల అరెస్టు

- రూ.2.33 లక్షలు స్వాధీనం

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పొలాల్లో పేకాట ఆడుతున్న 15 మందిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.33 లక్షల నగదు, రెండు కార్లు, 14 సెల్‌ఫోన్లు, 8 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: కొండపి మండలం మిట్టపాలెంలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న ఎం నాగేశ్వరరావును అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆమె వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండలంలోని గాయంవారిపల్లి, వాలిచర్ల, దాసరిపల్లి, కొండారెడిడపల్లి, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ దార్ల సందీప్‌కుమార్, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఆపార్ కార్డులపై అవగాహన అవసరం

కనిగిరి రూరల్: ఆపార్ కార్డులపై విద్యార్థుల తల్లిదండ్రులు అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పామూరు రోడ్డులోని సచివాలయంలో బుధవారం సమగ్రశిక్ష, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆపార్ కార్డుల వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు వసతి కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పామూరు: స్థానిక గుజ్జుల సరళాదేవినగర్‌లో నివాసముంటున్న ప్రజలు రోడ్డు వసతిలేక నానా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం రోడ్డు మంజూరుచేసి నూతనంగా రోడ్డు వేయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం సరళాదేవినగర్ వాసులు ఈఓ గంగిరెడ్డి అరవిందకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, సరళాదేవి కాలనీవాసులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం


మసీదు ప్రారంభోత్సవంలో చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మండలంలోని పోలవరంలో నూతనంగా నిర్మించిన మసీదు ప్రారంభోత్సవంలో బుధదవారం చైర్మన్ గఫార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టపాసుల అమ్మకాల్లో జాగ్రత్తలు పాటించాలి

సింగరాయకొండ: టపాసుల అమ్మకాల్లో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై బి.మహేంద్ర దుకాణాల యజమానులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇసుక, నీరు ఏర్పాటు చేసుకోవాలని అమ్మకాలు జరిగేటప్పుడు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. కాలేజీ ప్రాంగణంలో మొత్తం 11 దుకాణాలు ఏర్పాటు చేశారని అమ్మకాలు ఇక్కడే జరగాలని మరెక్కడా దుకాణాలు ఏర్పాటు చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్య శిబిరాల ఊసెక్కడ..!


ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం(ఫైల్)


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో కార్పొరేట్ వైద్యం
- ఉచితంగా వైద్యపరీక్షలు, మందుల పంపిణీ
- కూటమి ప్రభుత్వంలో ఆ ఊసే లేదు
- వ్యాధులతో తల్లడిల్లుతున్న పల్లెలు
- పట్టించుకునే నాథుడే కరువు

పామూరు:

పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో 14 రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందలు అందజేశారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని దగ్గరలో ఆరోగ్యశ్రీ అమలవుతున్న హాస్పిటల్‌కు మెరుగైన వైద్యపరీక్షలు, వైద్యంకోసం సిఫారుసుచేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యసేవలను గాలికొదిలేయడంతో కార్పొరేట్ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.

పడకేసిన వైద్యం..

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేస్తోంది. ఆధునిక వైద్యసేవలకు పల్లెవాసులు క్రమేణా దూరమయ్యాయి. వ్యాధులొస్తే పట్టణాలకు వేళాపాళా లేకుండా పరుగులు తీయాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేసింది. సచివాలయాల పరిధిలోని ప్రతి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులద్వారా వైద్యసేవలు అందించడమే కాకుండా మందులను సైతం ఉచితంగా అందించింది. చిన్న పిల్లలు, గర్భిణీలు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి నిపుణులైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతి వైద్యశిబిరానికి సుమారు మూడు నుండి 5 మంది వరకు స్పెషలిస్ట్ వైద్యులతోపాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు అందించేవారు.

ప్రజారోగ్యాన్ని పట్టించుకునేదెవరు..?

అటువర్షాలు, ఇటు ఎండలు భిన్న వాతావరణంతో పాటు, సీజనల్ వ్యాధులకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒళ్లు నొప్పులు, తలనొప్పి, జ్వరాలు, విరోచనాలు, దగ్గు, జలుబు ఇతర సీజనల్ వ్యాధులు గ్రామాల్లో విజృంభిస్తున్నాయి. కానీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రజలకు మేలుచేసే ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మళ్లీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

> **పేదలు ఇబ్బందులు పడుతున్నారు:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. సచివాలయాలు, విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.
> నవరం రత్తమ్మ, ఎంపీటీసీ, బోడవాడ

కానరాని దీపావళి సందడి ..


కనిగిరిలో ఏర్పాటు చేసిన దీపావళి స్టాల్స్

కనిగిరి రూరల్: దీపావళికి టపాసులు కాల్చడం అంటే అందరికి ఇష్టం. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ దీపావళి సంతోషాన్ని పంచుకుంటారు. అంటువంటి పండుగ ప్రస్తుతం వెలవెలబోయే పరిస్థితి నెలకొంది. పెరిగిన నిత్యవసర ధరలు, అందని సంక్షేమ పథకాల ఫలాలు, వెరిసి ప్రజల ఆర్థిక ఇబ్బందులు దీపావళి వ్యాపారులపై కాటు పడింది. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు దెబ్బ తినడంతో రైతులు కూడా అనుకున్న స్థాయిలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు కొనుగోళ్లకు రాలేదు. దీంతో పట్టణంలోని స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు పక్కన ఉన్న గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ వెలవెలబోతూ కన్పించాయి. బుధవారం నాటికి వ్యాపారం మందకొడిగా ఉందని.. వ్యాపారులు వాపోతున్నారు. దీంతో స్టాల్స్ వద్ద హడావుడి అనుకున్నంత లేదు. దీంతో వ్యాపారులు గురువారం ఒక్క రోజు వ్యాపారంపైనే ఆశ పెట్టుకుని ఉన్నారు. ఇప్పటికే సగం వరకు జరగాల్సి వ్యాపారం పాతిక శాతం కూడా లేదని వ్యాపారులు వాపోతున్నారు. మరోవైపు అధిక ధరలకు విక్రయాలు జరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవైపు కన్నెత్తి చూడటం లేదంటూ అతిశ యోక్తి కాదు.


వ్యాపారం లేక వెలవెలబోతున్న దుకణాలు

> **45 దుకాణాలకు అనుమతి:** నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పొన్నలూరుకు సంబంధించి ఫైర్ శాఖ ఆధ్వర్యంలో 45 బాణా సంచా దుకాణాలకు అనుమతి పొందినట్లు ఫైర్ అధికారి సీహెచ్ బంగారు బాబు తెలిపారు. కనిగిరి 23, పామూరు 9, వెలిగండ్ల 3, సీఎస్ పురం 3, పొన్నలూరు 2. పీసీపల్లి 2, హెచ్‌ఎం పాడు 1 బాణసంచా దుకాణాలకు అనుమతి పొందినట్లు తెలిపారు.
> సీహెచ్ బంగారు బాబు, ఫైర్ ఆఫీసర్

చట్టాలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

సింగరాయకొండ: ఎస్సీ, ఎస్టీ కులాల వారు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ టి.రవి అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పానుగోటివారిపాలెం ఎస్సీ కాలనీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ రవి మాట్లాడుతూ ఎస్సీలను ఎవరరైనా దూషించి కేసు నమోదైతే బాధితులకు ప్రభుత్వం రూ.లక్ష అందజేస్తుందన్నారు. అనంతరం కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కాలనీలో బోరు మరమ్మతులకు గురైందని, ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదని చెప్పడంతో వెంటనే బోరు రిపేరు చేయిస్తానని ఎంపీడీఓ డి.జయమణి హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్యాధికారి చైతన్యకృష్ణ, పశువైద్యాధికారి హజరత్, ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, వీఆర్‌ఓ మాధవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మండలంలో 14 వార్డు సచివాలయాల పరిధిలో 1000 ఇంకుడు గుంతలు, 25 పశువుల షెడ్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి టీఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడుగుంతలు, పశువుల షెడ్ల పనులు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఇంకుడు గుంతకు రూ.6 వేలు, పశువులకు షెడ్లకు రూ.2.30 లక్షల నిధులు ఇస్తారన్నారు. పనులు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. ఉపాధి నిధుల ద్వారా పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకున్న 59 రైతులకు మంజూరైనట్లు తెలిపారు. వారిలో 12 ఎకరాలో నిమ్మ సాగు చశారన్నారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు

మద్దిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ సిబ్బంది కరప్షన్ ఫ్రీ ఇండియా అనే అంశంపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలల్లో 10 వ తరగతి విద్యార్థిని సీహెచ్ అర్చన ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ, తృతీయ స్థానంలో స్థానంలో 9 వ తరగతి విద్యార్థిని లక్ష్మీ అనన్య, 8 తరగతి విద్యార్థిని బి.మోనీషా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రెబ్బా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



కీర్తన

టంగుటూరు: అనంతపురం ఎస్‌కేయూ యూనివర్శిటీలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ సెలక్షన్స్‌లో మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గుమ్మా కీర్తన ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసరాజు తెలిపారు. కీర్తన వచ్చే నెల 8 నుంచి 12 తేదీ వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఉపాధ్యాయులు కీర్తనను అభినందించి ఖర్చుల నిమిత్తం రూ.12 వేలు అందజేశారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లపై అవగాహన


గ్యాస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసిల్దార్ మురళి

కొండపి: మండలంలోని స్థానిక హెచ్పీ గ్యాస్ కేంద్రంలో బుధవారం తహసీల్దార్ పి.మురళి ఉచిత గ్యాస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులు ముందు నగదు చెల్లిస్తే నగదు బ్యాంకు ఖాతాలో పడుతుందన్నారు. వీఆర్వో సునీల, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు


సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి: మండల పరిధిలోని పీసీపల్లి వైఎస్సార్ సెంటర్ కూడలి, పెద ఈర్లపాడు గ్రామ కూడలిలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. 100 మంది కంటే ఎక్కువ జన సంచారం ఉండే వ్యాపార సముదాయాల వద్ద, రెస్టారెంట్లు, హోటళ్లు, టీస్టాల్స్, దేవాలయాల వద్ద, పెట్రోల్ బంకులు, నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఏదైనా అసాంఘిక కార్యకలాపాల సమయంలో నిందితులను త్వరగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

92 అర్జీలు స్వీకరణ


దాసళ్లపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ కిషోర్‌రెడ్డి

సింగరాయకొండ: భూముల రీసర్వే లో తలెత్తిన సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహించినట్లు తహశీల్దార్ టి.రవి తెలిపారు. మండలంలోని పాకల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ గ్రామసభలో 92 అర్జీలు వచ్చాయన్నారు. 25 అర్జీలు ఒకే ఎల్‌పీఎం నంబర్‌పై భూములు ఉన్నాయని, 13 అర్జీలు భూముల కొలతల్లో తేడాలు, 54 అర్జీలు ఆన్‌లైన్ నమోదుకు సంబంధించినవని వచ్చినట్లు వివరించారు. అర్జీలను 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఎస్ చంద్రశేఖర్, సర్వేయర్ బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని దాసళ్లపల్లిలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు 49 అర్జీలు వచ్చినట్లు డీటీ కె.కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్‌ఓ పరుశురాం, సచివాలయ సర్వేయర్లు రాజశేఖర్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి ముందస్తు వేడుకలు


కనిగిరి: దీపావళి వేడుకల్లో కళాశాల విద్యార్థినులు


పామూరులో దీపావళి వేడుకలు

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో బుధవారం దీపావళి పండుగ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైష్ణవీ మహిళా డిగ్రీ కళాశాలలో దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. కళాశాల విద్యార్థినులు ప్రమిదల్లో దీపాలు వెలిగించి.. సరి కొత్త కాంతులకు స్వాగతం పలికారు. కాకరవత్తులు, చిచ్చురుబుడ్లు కాల్చి సంతోషాన్ని పంచుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి విద్యార్థినులకు దీపావళి విశిష్టతను తెలిపి, శుభాకాంక్షలు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఐకిడ్స్ స్కూల్‌లో కూడా దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


దొడ్డిచింతలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ


రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏఓ విజయ్ కుమార్


లక్ష్మీనరసాపురంలో రైతులకు సాగు సూచనలిస్తున్న ఏఓ రాధ

హనుమంతునిపాడు: కంది రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని, అధికారులు సూచనలు మేరకు తెగుళ్ల నివారణ మందులు వాడాలని కనిగిరి డివిజన్ వ్యవసాయ సహాయకులు ఈవీ రమణ అన్నారు. మండలంలోని కూటాగుండ్ల, దొడ్డిచింతల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కంది, మినుము పంటలు పరిశీలించారు. కందిలో వైరస్ వల్ల తెగులు ఉన్నట్లు గుర్తించారు. మినుము, కంది, అలసంద, వరి, వేరుశనగ పంటలకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఓ ఎం.అంజలీబాయి, ఏఓ కె.రమణ, వీఏఓ గోపి క్రిష్ణ, వీఏలు నవ్య, ఏడుకొండలు, భారతి, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

కొండపి: మండలంలో వరి, మిరప సాగు చేసే రైతులు తప్పనిసరిగా బీమా చెల్లించాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని పెట్లూరు, మూగచింతల గ్రామాల్లో సిబ్బందితో కలిసి పంటలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఐ పద్మ, పశుసంవర్థక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పామూరు:** కంది, వరి పంటలను ఆశించే తెగుళ్లపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. కందిని ఆశించే ఎండు తెగులు, వెర్రి తెగులు, మినుము సాగులో విత్తన శుద్ధి, కలుపు నివారణ చర్యలు వివరించారు.

సీఎస్‌పురం(పామూరు): వరి, మినుము, కంది పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి, కోవిలంపాడు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏ యం.కె.విజయభాస్కర్, వి.హరీష్, వీఏహెచ్ టి.అమృత, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయధికారి స్వర్ణలత తెలిపారు. మండలంలోని జయవరం, తూర్పునాయుడుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు విజయమాధవి, సర్పంచ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి


టంగుటూరులో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలైన జనుము మొదలగు వాటిని వేసి కలయ దున్నాలని వేలం నిర్వహణాధీకరి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు బోర్డు వేలం కేంద్రంలో పొగాకు రైతులకు పొగాకు పంట ఉత్పత్తి నియంత్రణ, పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒంగోలు బోర్డు సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ తులసి మాట్లాడుతూ గత ఏడాది లభించిన ధరలు చూసి ఈ ఏడాది అధిక ధరలకు బ్యారెన్లు, పొలాలు కౌలుకు తీసుకోవద్దని సూచించారు. రైతులు బోర్డు సూచించిన పరిమితి మేరకే పొగాకు పండించాలన్నారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనధికారికంగా బ్యారెన్లు నిర్మించవద్దన్నారు. రైతులు సీటీఆర్‌ఐ, పొగాకు బోర్డు వారిచే సిఫార్సు చేసి వంగడాలను సాగు చేయాలని సూచించారు. దర్శి సైంటిస్ట్, కేవీకే డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా నల్లరేగడి నేలల్లో శనగ, మినుము, మిరప, మొక్కజొన్న మొదలైన పంటలను సాగు చేసుకోవాలన్నారు. విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చని సూచించారు. వ్యవసాయాధికారి స్వర్ణలత మాట్లాడుతూ పొగాకు వేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. పొగాకు రైతు నాయకుడు, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని చౌటపాలెంలో స్వచ్ఛత హీ సేవ, పొగాకు పంట నియంత్రణ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ చౌటపాలెం గ్రామాన్ని ఆదర్శంగా గ్రామంగా ఎంపిక చేశామన్నారు. పొగాకు రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నామని, వాటిని నాటాలన్నారు. జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు, మోతిలాల్, పొగాకు బోర్డు క్షేత్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: మద్యం అమ్మకాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం మద్యంషాపుల యజమానులకు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ వ్యక్తికి రోజుకు 3 బాటిళ్లు అమ్మాలని, బెల్టుషాపులకు సహకరించవద్దని తెలిపారు. ఎమ్మార్పీ ప్రకారమే మద్యం అమ్మాలని, షాపు వద్ద మద్యం సేవించకూడదని, రూ.99 మద్యం బాటిల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం మద్యం షాపులు ఏర్పాటు చేయాలని, నిబంధనలు అతిక్రమించడానికి వీల్లేదన్నారు. ఎక్సైజ్ సీఐ శివకుమారి మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన షాపు యజమానులపై కేసులు చేస్తామన్నారు. రెండుసార్లు కేసు నమోదైతే పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. షాపుల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నాలుగు మండలాల లైసెన్స్‌దారులు పాల్గొన్నారు.